క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం సిరికొండకు చెందిన దాసరి పర్శరాములు అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉండగా.. అతడికి చికిత్స అందించేందుకు రూ.2.50లక్షల ఎల్‌వోసీని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కవ్వంపల్లికి ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎంపీపీ అయిలయ్య తదితరులు ఉన్నారు.

రెండ్రోజుల్లో ధాన్యం కొనుగోలు చేస్తాం



రైస్‌మిల్లు యాజమానులతో మాట్లాడుతున్న రైతులు

ఎల్లారెడ్డిపేట: కిషన్‌దాస్‌పేటలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ద్వారా మూడువేల క్వింటాళ్ల ధాన్యాన్ని ఇదే మండలంలోని పదిర లలితా పరమేశ్వరి ఇండస్ట్రీస్ రైస్ మిల్ కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. బుధవారం ధాన్యం కొనుగోళ్లపై మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్ ఆధ్వర్యంలో రైతులు రైస్ మిల్లు యాజమానులతో చర్చలు జరిపారు. నిబంధనల ప్రకారం ధాన్యాన్ని తాలు లేకుండా తీసుకు రావాలని, మరో రెండ్రోజుల్లో కొనుగోలు చేస్తామని మిల్లర్లు రైతులకు హామీ ఇచ్చారు. దీంతో కొనుగోళ్ల ప్రారంభం కానుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఐకేపీ కేంద్రానికి స్థలం కేటాయింపు

ముస్తాబాద్: మండలంలోని తెర్లుమద్దిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రానికి సర్వే నెంబర్ 324లో ఐదెకరాలు తహసీల్దార్ కేటాయించారని ఎంపీటీసీ బైతి దుర్గవ్వ తెలిపారు. కొన్నేళ్లుగా గ్రామంలోని ప్రభుత్వ భూములను ఇతరులు కబ్జాలకు పాల్పడుతున్నారని, ఈ విషయమై గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. రైతులందరికీ ఉపయోగపడేలా ధాన్యం కొనుగోలు కేంద్రానికి స్థలం ఇవ్వాలని కోరగా కేటాయించినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు అన్ని వసతులు కల్పించేలా చూస్తామన్నారు.

'ఉపాధి' కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి



ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న సిబ్బంది

ముస్తాబాద్: ఉపాధిహామీ కూలీలు ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి గీతాంజలి సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులు జరిగే చోట కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నామన్నారు. కూలీలు ఉదయమే పనికి వెళ్లి 11 గంటల వరకు ఇళ్లకు చేరుకోవాలన్నారు. పని ప్రదేశం చోట తాగునీటితోపాటు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. డీహైడ్రేషన్‌కు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆశాలు ఆయా గ్రామాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



బోయినపల్లి: మండలకేంద్రంలోని రామాలయ పరిసరాల్లో శ్రీ రామానంద భక్త సమాజం ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో రాములోరి కల్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తులకు సురక్షితమైన నీరు అందించారు. శ్రీరామనవమి సందర్భంగా రాజమల్లు (శివాలయ పూజారి) పేరున చలివేంద్రం ఏర్పాటు చేశారు.

సరస్వతి విద్యాపీఠం ఆవిర్భావ దినోత్సవం

వేములవాడఅర్బన్: పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో సరస్వతి విద్యాపీఠం ఆవిర్భావ దినో త్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు గొప్పవారుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు, పాల్గొన్నారు.



తంగళ్లపల్లి: రాములోరి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



చందుర్తి : కట్ట లింగంపేట సీతారామస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నాయకులు



గంభీరావుపేట: రామాలయంలో పూజలు చేస్తున్న బోయినపల్లి వినోద్‌కుమార్



వేములవాడ అర్బన్: అగ్రహారంలో తాళి బొట్టు చూపుతున్న అర్చకుడు



ఘనంగా రాములోరి కల్యాణం

సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో బుధవారం శ్రీ సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో వేద మంత్రోచ్ఛారణల మధ్య సీతారాముల కల్యాణ వేడుకలను జరిపించారు. ముందుగా మంగళవాయిద్యాలతో సీతారాములు ఉత్సవ విగ్రహాలను గ్రామాల్లోని పురవీధుల గుండా ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు తండోపతండాలుగా తరలివచ్చారు. సిరిసిల్ల పట్టణంలోని పెద్దబజార్ రామాలయంతో పాటు, విద్యానగర్, సుభాష్‌నగర్, వెంకంపేట, నెహ్రూనగర్, పట్టణ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ ఆలయంలో రాములోరి కల్యాణం జరిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి పాల్గొన్నారు. బీవైనగర్ హనుమాన్, చంద్రంపేట అభయాంజనేయ స్వామి ఆలయాల్లో కల్యాణం నిర్వహించారు. పలు ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు. చందుర్తి మండలం కట్టలింగంపేట, జోగాపూర్ సీతారామచంద్రస్వామి ఆలయాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, హనుమాన్ దీక్షాపరులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



తంగళ్లపల్లి: పద్మనగర్‌లో పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న గ్రామస్తులు



ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్‌లో..



బోయినపల్లి: ఉత్సవమూర్తుల శోభాయాత్ర



రుద్రంగి: హనుమాన్ ఆలయంలో కల్యాణం తిలకిస్తున్న భక్తులు



గంభీరావుపేట: సీతారాముల కల్యాణంలో పాల్గొన్న టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, తదితరులు



చందుర్తి : లింగంపేటలో సీతారాముల కల్యాణం



కోనరావుపేట: మామిడిపల్లిలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



ముస్తాబాద్: పోతుగల్‌లో రాములోరి శోభాయాత్ర



తంగళ్లపల్లి: సారంపల్లిలో సీతారాముల, హనుమాన్ విగ్రహాలతో దీక్షాపరులు



వీర్నపల్లిలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



ముస్తాబాద్‌లో హనుమాన్ దీక్షాపరుల శోభాయాత్ర



కోనరావుపేట : కనగర్తిలో ఉత్సవమూర్తులను తీసుకువస్తున్న భక్తులు

పెద్దమ్మ- పెద్దిరాజుల కల్యాణం

గంభీరావుపేట: మండలంలోని కొత్తపల్లిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ పెద్ది రాజుల కల్యాణోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మంగళహారతులతో తరలివచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పెరిమెల్లి లింగయ్య, నాయకులు నర్సింలు, బాలరాజు, సంతోష్, రమేశ్, ఆంజనేయులు, మల్లేశం, స్వామి, పోశయ్య, ప్రమోద్,, తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న ముదిరాజ్ సంఘం నాయకులు

ఏళ్లుగా అద్దె భవనాల్లోనే..

- మండలం ఏర్పడి ఏడేళ్లు దాటినా అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు
- ఇరుకు గదుల్లోనే సిబ్బంది విధులు
- పట్టించుకోని అధికారులు



అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం



పాత జీపీ భవనంలోనే స్వశక్తి భవనం

వీర్నపల్లి: మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు ఏళ్లుగా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. దీంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించేందుకు ఇబ్బంది పడుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాలు, మండలాల పునర్విభజనలో భాగంగా ఎల్లారెడ్డిపేటలోని వీర్నపల్లిని 17 గ్రామ పంచాయతీలతో నూతన మండలంగా ఏడేళ్ల క్రితం ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా సమస్యలు పరిష్కరించి గిరిజన తండాల వాసులు అధికారులు, పాలకులను కోరుతున్నారు.

మండలంలో 17 గ్రామ పంచాయతీలు

మండలంలో 17 గ్రామపంచాయతీలుండగా మండలకేంద్రాన్ని ప్రారంభించిన సమయంలో పోలీస్‌స్టేషన్, తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయం, వ్యవసాయశాఖ కార్యాలయం, పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే మహిళా సమైఖ్య భవనం, ఉపాధి హామీ కార్యాలయాన్ని అద్దె భవనాల్లో ప్రారంభించి గత ప్రభుత్వం చేతులు దులుపుకుంది, కానీ ప్రజలు నిత్యం సమస్యలతో సతమతమవుతున్నారు. 17 గ్రామపంచాయతీలకు ప్రభుత్వ కార్యాలయాల్లో తగిన సంఖ్యలో అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది, పశువైద్య సిబ్బంది లేరు. ఉన్న అధికారులకే అదనపు బాధ్యతలు అప్పగిస్తుండటంతదో అధికారులు ఒత్తిడికి లోనవుతున్నారు. మారుమూల గ్రామీణ ప్రాంత రైతులు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

అందని వైద్య సేవలు..

మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందడం లేదు. ఉన్న రెండు ఆరోగ్య ఉపకేంద్రాల ద్వారా ప్రజలకు ఎలాంటి వైద్యం అందడం లేదన్న ఆరోపణలున్నాయి. 17 పంచాయతీలకు ఇద్దరు సెకండ్ ఏఎన్‌ఎంలు మాత్రమే అందుబాటులో ఉన్నారు. పీహెచ్‌సీ అందుబాటులో లేక గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు అందక రోగాల బారినపడుతున్నారు. ఆరోగ్య ఉప కేంద్రాలకు సాయంత్రం నాలుగు అయిందంటే తాళాలు వేసి ఉంటాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని పశువైద్యశాలలో ఒక్కరే వెటర్నరీ అసిస్టెంట్ ఉండటంతో మూగజీవాలకు సరైన వైద్యం అందక మత్యువాతపడుతున్నాయి.

భవనాలు నిర్మించాలి



వీర్నపల్లి మండలం ఏర్పడి దాదాపు ఏడేళ్లు గడుస్తున్నా ఇంకా అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోతోంది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా కార్యాలయ భవనాలకు పక్కా భవనాలను వెంటనే మంజూరు చేయాలి.

– అరుణ్ కుమార్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు

వసతులు లేవు



ఎన్నో ఏళ్లుగా అద్దె భవనంలోనే మహిళా స్వశక్తి సంఘం కొనసాగుతోంది. అద్దె పెరగడంతో మండల కేంద్రంలోని పాత గ్రామ పంచాయతీలో మహిళా స్వశక్తి సంఘాన్ని నిర్వహిస్తున్నాం. అందులో సరైన వసతులు లేవు. దీంతో మహిళా సంఘం సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం.

– నర్సయ్య, ఏపీఎం, వీర్నపల్లి

ప్రజలను మభ్యపెడుతున్న బీజేపీ



మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్ కుమార్

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్

గంభీరావుపేట: మాయమాటలతో బీజేపీ గారడీ చేస్తోందని, ప్రచార అస్త్రాలతో ప్రజలను మభ్యపెడుతోందని, కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల పరిపాలనలో బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో నలుగురు ఎంపీలు ఉన్నా ఒక్క మెడికల్, నవోదయ కళాశాల తేలేదన్నారు. రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి దాటవేత ధోరణి అవలంబిస్తున్నారన్నారు. గోదావరి, కృష్ణా నదులపై నిర్మించిన ప్రాజెక్టులకు జాతీయహోదా ఇవ్వలేదని గుర్తుచేశారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక్క హామీని అమలు చేయడం లేదన్నారు. తనను గెలిపిస్తే పార్లమెంట్ పరిధిలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీలు ఏర్పాటు చేయిస్తానని, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని వినోద్‌కుమార్ హామీ ఇచ్చారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, ఎంపీపీ కరుణ, సెస్ డైరెక్టర్ నారాయణరావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల, పట్టణశాఖ అధ్యక్షుడు వెంకటస్వామి గౌడ్, వెంకటి యాదవ్, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు లతారెడ్డి, నాయకులు దయాకర్‌రావు, లింగంయాదవ్, లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మహబూబ్ అలీ, వహీద్, రమేశ్, స్వామి, దోసల శంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

చందుర్తి : మండలంలోని నర్సింగాపూర్ – మూడపల్లి గ్రామాల మధ్య రోడ్డుకిరువైపు ఉన్న పిచ్చి మొక్కలను జేసీబీ సాయంతో బుధవారం తొలగించారు. ప్రయాణికుల రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలుసుకున్న ఎంపీపీ లావణ్య పిచ్చిమొక్కలు తొలగించారు.